బ్యాంక్ నుంచి వచ్చి టీ కలుపుకుని త్రాగి, శ్రీమతి కోసం ఫ్లాస్క్‌లో పోసి ఉంచడం నాకు అలవాటు. పిల్లలు ఆటల నుంచి రాగానే వాళ్ళ హోమ్‌వర్కుల గురించి వివరాలు కనుక్కుని, వాళ్ళని చదువుల్లో కూరాను. అప్పుడే వచ్చింది శ్రీమతి. టీ సిప్ చేస్తూ ఆ రోజు వాళ్ళ ఆఫీసులో విశేషాలు, వాటి హైలైట్స్ చెప్తోంది. తను ఓ ప్రైవేటు కంపెనీలో టైపిస్టు. ఈలోగా అన్నాడు మా బాబిగాడు, "నాన్నా! మా టీచర్ గ్రాఫ్ పుస్తకం తెమ్మంది, వెళ్ళి కొనుక్కురానా?"

"వద్దులే... నువ్వు హోమ్‌వర్కు చెయ్యి. నేను వాకింగ్‌కి వెళ్ళినప్పుడు తెస్తాలే..." అని చెప్తూనే నా కళ్ళు శ్రీమతి కోసం వెతికాయి. ఆమె అప్పటికే వంటింట్లోకి వెళ్ళి వంట పన్లోకి ఉపక్రమించిదన్న విషయాన్ని చాటుతూ డబ్బాలు డబ డబా చప్పుళ్ళు చేస్తున్నాయి. బజారు నుంచి తేవలసిన కూరగాయలు, ఇంకా చిన్న




## లక్ష్మిమాధవ్

చిన్న సామాన్ల జాబితా వ్రాసుకుని బయటకు వస్తుండగా అన్నది శ్రీమతి... "వస్తూ నా చీర ఫాల్స్ కుట్టటం పూర్తయితే సుబ్రహ్మణ్యం కొట్టు నుంచి తీసుకురండి".

ఒక అరగంట వాక్ చేశాక, షాపింగ్ ముగించుకుని టైలర్ సుబ్రహ్మణ్యం షాపుకి వెళ్ళాను. సుబ్రహ్మణ్యం ఏదో కుట్టుకుంటు న్నాడు. నన్ను చూడగానే లేచి నిలబడ్డాడు. "ఫర్వాలేదు కూర్చో..." అన్నట్లుగా చెయ్యూపి, ప్రక్కనున్న స్టూల్ మీద కూర్చున్నాను. ఖాన్ కూడా బట్టలు కుడుతున్నాడు. నాతో పిచ్చా పాటి కబుర్లు చెప్తూనే సల్వార్ కమీజ్ కుట్టటం ముగించాడు. తరువాత నీట్‌గా ఇస్త్రీ చేసి, కస్టమర్ వస్తే ఇవ్వటానికి సిద్ధంగా కవరులో పెట్టాడు. కొంతసేపు నాతో మాట్లాడి, నేను గడియారం వైపుకి చూడడం గమనించి, మా ఆవిడ చీరని ఒక కవరులో పెట్టి తెచ్చిచ్చాడు. డబ్బులివ్వబోతే ఖాన్ "వద్దుసార్... ఫాల్ ఎలా గూ మీరే కొనితెచ్చారు కదా... మీ దగ్గర కూడా డబ్బులు పుచ్చుకుంటామా?" అన్నాడు నన్ను వారిస్తూ. అయినా నేను ఊరుకోలేదు. పది రూపాయల నోటు తీసి సుబ్రహ్మణ్యం వంక చూసి నవ్వుతూ ఖాన్ జేబులో పెట్టాను. దానికి సుబ్రహ్మణ్యం కూడా మొహమాటంగా నవ్వా డు. దండం పెట్టి వద్దన్నట్లుగా సైగ చేశాడు. నేను "ఫర్వాలేదులే... ఇలా అయితే మీ కొట్టు ఎలా సాగుతుంది? ఎవరైనా ఒక్కటే" అంటూ ప్యాకెట్ తీసుకుని వచ్చేశాను.

సుబ్రహ్మణ్యం నాకు బాగా తెలిసిన కుర్రా డు. వాళ్ళ నాన్న సుబ్బయ్య మా నాన్నగారికి చిన్నప్పటి నుంచీ తెలుసు. సుబ్బయ్యది పెద్ద కుటుంబం. గంపంత సంసారాన్ని ఈదలేక ఈదలేక ఈదుతూ ఉండేవాడు. నాన్న వాడికి ఇబ్బందుల్లో చిన్న చిన్న ఖర్చులకు డబ్బులు సర్దుబాటు చేయటమే కాక చేబదుళ్ళు ఇచ్చి అవసరానికి ఆదుకుంటూండేవారు. సుబ్బయ్య భార్య, పిల్లలు చిన్న చిన్న పనులు చేస్తూ అంతా కలిసి సంసారాన్ని నెట్టేవారు. సుబ్బయ్య నాన్న దగ్గర వాపోతే, నాన్న సుబ్బయ్య పెద్ద కొడుకుని తనకు తెలిసిన టైలర్ దగ్గర కాజాలు, గుండీలు కుట్టటానికి కుదిర్చారు. వాడే సుబ్రహ్మణ్యం. సుబ్రహ్మణ్యం తెలివి తేటలతో బట్టలు కుట్టటం చూసి నాన్న వాడిని ఫ్రీగా టైలరింగ్ క్లాసెస్ నడుపుతామని పేపర్లో పడ్డ ఏడ్ చూసి వాటి వివరాలన్నీ సేకరించి, అందులో చేర్పించారు. వాడికా విధంగా టైలరింగ్ రావటానికి నాన్న కారణం అయ్యారు. వేసవి శెలవుల కని ఊరెళ్ళాము నేను, శ్రీమతి, పిల్లలు. వీడి విషయం నాన్న ద్వారా



విన్న నేను వాడిని హైదరాబాద్ తీసుకొచ్చి టైలర్ షాపు పెట్టిస్తే మంచి ఆదాయం వస్తుందనే ఐడియా ఇచ్చి నాతో తీసుకొచ్చాను. సుబ్రహ్మణ్యం మూగవాడు.

నేను బ్యాంక్‌లో జాబ్ చేస్తూండడం వల్ల మా మేనేజర్ దగ్గర లోన్‌కి రికమండ్ చేసి, కుట్టు మిషన్ కొనిపించాను. నాకు తెలిసిన వాళ్ళ కారు షెడ్‌లో బట్టలు కుట్టడం ప్రారంభించాడు సుబ్రహ్మణ్యం. బట్టలు బాగా కుట్టటం వల్ల బేరాలు బాగానే వస్తున్నాయి. ఖాన్ అనే లేడీస్ టైలర్ ఒకతను కూడా సుబ్రహ్మణ్యంతో కలిశాడు. ఈమధ్య ఇద్దరూ కలిసి సెంటర్‌లో ఒక కొట్టు అద్దెకి తీసుకుని, బాగానే సంపాయించుకుంటున్నారు.

సుబ్రహ్మణ్యానికి మాటలు రాకపోయినా సైగలతోనే తన బేరాలని మేనేజ్ చేసేవాడు. మిగతా విషయాలన్నీ ఖాన్ చూసుకుంటాడు. సుబ్రహ్మణ్యానికి నేను చేసిన ధన సాయం, మాట సాయం విషయాలన్నీ తెలవటం వల్ల ఖాన్‌కి కూడా నేనంటే విశ్వాసం.


మా ఇంట్లోవాళ్ళ బట్టలేకాక మా పరిచయస్థుల బట్టలు కూడా నేను సుబ్రహ్మణ్యం కొట్లోనే కుట్టించేవాడిని. మొదట్లో వాళ్ళు మొహమాట పడి మా ఇంట్లో వాళ్ళ బట్టలకి డబ్బులు తీసుకునేవారు కాదు. కానీ నేను వారికి ఏదో ఒక రూపంలో వాళ్ళ కష్టం ఉంచుకోకుండా ముట్టచెప్పేవాడిని. దారాలు, జిప్పులు ఇలా ఏవో అవసరమైన సామాన్లు కొని ఇస్తూండేవాడిని. కానీ వాళ్ళ అవసరాలొక్కటైతే నేను ఇంకేదో ఇచ్చి వాళ్ళని ఇబ్బంది పెడ్తున్నానేమోనన్న అనుమానం రావటంతో ఈ మధ్య బలవంతపెట్టి మరీ డబ్బే ఇచ్చేస్తున్నాను. అన్ని విధాలా ప్రోత్సహించి, వాళ్ళిద్దరినీ ముందుకి తీసుకురావాలన్నదే నా తాపత్రయం.

ఇంటికి వస్తూ సుబ్రహ్మణ్యం వయస్సు అంచనా వేశాను. అంత చిన్నవాడేమీ కాదు. ఇరవై తొమ్మిదికి పైబడే ఉంటాయి. "త్వరలో పెళ్ళి చేసుకోమని చెప్పాలి. ఈసారి ఊరెళ్ళినప్పుడు వాళ్ళ నాన్నతో ఈ విషయం చర్చించాలి" అనుకున్నాను. క్రితం సంవత్సరమే సుబ్రహ్మణ్యం ఆఖరి చెల్లెలి పెళ్ళి చేశారని తెలిసింది. కాబట్టి తనకింక లైన్ క్లియర్ అయినట్టే.

పెళ్ళంటే అతనికి ఇంకొక మనిషిని పోషించే స్థోమత ఉండాలి. తర్వాత పిల్లలు, మిగతా ఖర్చులు... ఇలా ఆలోచిస్తూ నిట్టూర్చాను. పెరిగే ఖర్చులకి సరిపడే ఆదాయం రావాలంటే ఇంకా ఎక్కువ గిరాకీలు రావాలి. దానికి మంచి మోడల్ మిషన్‌లు ఇంకా ఒకటో రెండో కావాలి. ఇంకో ఇద్దరు కాజాలు, చేతికుట్లు కుట్టే కుర్రాళ్ళకి అతను జీతం ఇవ్వగలిగినంత ఆదాయం రావాలి. మాటలా?... ఇవన్నీ చేయాలంటే కొంచెం కష్టమే మరి... ఇవన్నీ ఉంటేకాని, పెళ్ళి సాధ్యపడదు. ఇంకా ఎక్కువ గిరాకీలు ఎక్కడ నుంచి వస్తాయి? అసలే జనం రెడీమేడ్ బట్టలు చవకని, అవంటే మక్కువ చూపుతున్న కాలమాయే?

పిల్లల స్కూలు యూనిఫామ్స్ వంటివి కుట్టటానికి కాంట్రాక్ట్‌లు లాంటివి కుదిరితే అప్పుడు ఎక్కువ లాభాలు వస్తాయి. మా పిల్లలు చదివే స్కూలుకి వెళ్ళి ప్రయత్నించాలి. వాళ్ళ ప్రిన్సిపాల్‌ని కలిసి ఈ విషయం మాట్లాడాలి". అసలే సుబ్రహ్మణ్యానికి మాటలు కరువు చేశాడా దేవుడు. పాపం మూగవాడు ఇలాంటి పెద్ద పెద్ద విషయాలు ఎలా డిస్కస్ చేయగలడు?" అను కున్నాను. నేనే పూనుకుని ఇలాంటి పెద్ద గిరాకీలు కొన్ని కుదర్చాలని మనసులోనే నిర్ధారించుకున్నాను.

ఇవన్నీ ఆలోచించుకుంటూ నడిచేసరికి




ఇల్లు ఇట్టే వచ్చినట్లనిపించింది. పిల్లలు హోమ్ వర్క్‌లు చేసేసి పుస్తకాలని బ్యాగుల్లోకి సాగనంపి, టి.వి. రిమోట్ కోసం పోట్లాడుకుంటున్నారు. శ్రీమతి టి.వి. సీరియల్స్ చూస్తానంటోంది. పిల్లలు కార్టూన్ నెట్‌వర్క్ కావాలంటారు. సరే నేనెందుకు ఊరుకోవటమని, న్యూస్ ఛానల్స్ కోసం నేనూ వంతులు, వాటాలు మొదలు పెట్టాను. ఈ గొడవలో పడి సుబ్రహ్మణ్యం విషయం మరచిపోయాను.

మర్నాడు ఉదయం పిల్లల్ని రెడీ చేస్తూ శ్రీమతి బేబీ ఫ్రాక్ జిప్పు పోయిందని, బయట కెళ్ళినప్పుడు సుబ్రహ్మణ్యం చేత వేయించమని అనేవరకూ అసలు సుబ్రహ్మణ్యం అనే వ్యక్తొకడు ఉన్నాడన్న విషయం మరిచాను. “ఎంతటి మతిమరుపు నాకు? స్వంత విషయాల సోదిలో పడి పరులకి చేద్దామనుకున్న చిన్న చిన్న సహాయాలను కూడా విస్మరిస్తున్నాను” అని నొచ్చుకుంటూ శ్రీమతితో యూనిఫామ్స్ కాంట్రాక్ట్ విషయం అన్నాను.

“వచ్చే నెలనుంచి పెద్ద పరీక్షలు మొదలు. ఇప్పుడు ఎవ్వరూ యూనిఫామ్స్ కుట్టించుకోరు” అని గుర్తు చేస్తూ శ్రీమతి మరో విషయం కూడా అందనుకోండి... తను అన్నది నిజమే... మళ్ళీ స్కూళ్ళు తెరిచే వరకూ ఆ విషయం మాట్లాడినా ప్రయోజనం ఉండదు. తాత్కాలికంగా ఆ పని వాయిదా పడింది. “అయినా ఎంతలో అవుతాయిలే పరీక్షలు? పరీక్షలవ్వగానే పరీక్షా ఫలితాలు, అవి ముగుస్తున్నాయనగానే కొత్త పుస్తకాల లిస్టులు, కొత్త బ్యాగ్‌లు, వాటర్ బాటిల్స్, పెన్సిల్ బాక్స్‌లూ, యూనిఫారమ్స్... ఇవన్నీ ప్రతి సంవత్సరం రొటీన్‌గా జరిగే విషయాలే కదా...” అనుకున్నాను.

శ్రీమతి టిఫిన్ చేసి హడావిడిగా ఆఫీసుకి బయల్దేరింది. బాబు, బేబీ స్కూలు వ్యాన్ ఎక్కారు. వాళ్ళకి టాటా... చెప్తూండగా లోపలికొచ్చింది పనిమనిషి గోవిందమ్మ.

“ఎన్నిసార్లు చెప్పినా లేటుగా వస్తావు.” కసురుకున్నాను. బ్యాంక్‌కి వెళ్ళటానికి ఇంకొక

గంటే ఉంది, త్వరగా పనిచేయమని చెప్పాను.

అది లేటుగా రావటానికి గల కారణం చెప్పి సంజాయిషీ ఇస్తూ చెప్పింది, “మా మనవడు రాజిగాడు ఇస్కోలు ప్యాంటు సిరిగిపోయింది. దాన్ని రెండు కుట్లు కుట్టి వచ్చేసరికి లేటై పోనాదయ్య... అయినా తొందరగా సేసేస్తాలే, నీకు ఆలస్యం సెయ్యను... బాబు”.

పాపం ముసలిది. కూతురు చచ్చిపోతూ తన కొడుకుని తల్లి చేతిలో పెట్టి పోయిందిట. అల్లుడు మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. చూస్తూ చూస్తూ మనవడిని సవితి తల్లి పాలన పడెయ్యటం ఇష్టంలేక, తనే మనవడిని దగ్గరుంచుకుని నాల్గిళ్ళలో పనులు చేస్తూ కష్టపడి చదివిస్తోంది. గోవిందమ్మ ఆలస్యానికి గల కారణాన్ని వింటూనే నా మనస్సు జాలితో నిండిపోయింది.

“ఇదిగో గోవిందమ్మా, మా బాబిగాడివి చిన్నవైపోయినవి ఒకటి రెండు ప్యాంట్లు ఉండాలి, అమ్మగారిని అడిగి సాయంత్రం తీసి కెళ్ళు, మీ రాజుగాడికి సైజు చేయించుకో” చెప్పానామెతో.

మీలాంటి దయగలోళ్ళు బట్టలు ఇచ్చినా, మిషన్ కుట్టోళ్ళు వాటిని సరిసేసి ఇయ్యటానికి ఏడుస్తారు బాబూ” తల బరుక్కుంటూ ఇబ్బందిగా చెప్పింది గోవిందమ్మ.

“లేదులే... మన సెంటల్లో, ఆ కిరాణాకొట్టు ప్రక్కగా ఉన్న టైలర్ నాకు బాగా తెలిసిన వాడే. బ్యాంకు బాబుగారు చేయమన్నారని చెప్పు. తప్పక చేసి ఇస్తాడు” భరోసా ఇస్తూ చెప్పాను ధీమాగా.

నా వైపుకి కృతజ్ఞతగా చూసి చెప్పింది, “నువ్వు చల్లగుండాల బాబు, ఎప్పుడే కష్టం సెప్పుకున్నా వెంటనే ఏదో ఒకటి సేసి సమయానికి ఇబ్బంది తీరుస్తావు అని పొగిడింది.

“సరేలే ఏదో... నా చేతనైన సాయం నేను చేశాను. కొత్త ప్యాంటు ఏమీ ఇవ్వలేదుగా అన్నాను హుందాగా.

ఆమె పని ముగించి వెళ్ళిపోయింది. నేను బ్యాంకుకి వెళ్ళటానికి డ్రస్ చేసుకుని, శ్రీమతి సర్దిపెట్టిన టిఫిన్ బాక్స్ తీసుకుని బయల్దేరాను.

* * *

ఆ రోజు ఒకటే వాన. పగలంతా వర్షం కురుస్తూనే ఉంది. రోడ్లు బురద. వచ్చే పోయే జనంతో బ్యాంక్ అంతా చితచితగా ఉంది. ఎక్కడ చూసినా జనం గొడుగులు వేసుకుని, రైన్‌కోట్స్ తొడుక్కుని తిరగటంతో పేవ్‌మెంట్స్, రోడ్లు అన్నీ కొత్తగా ఇరుకైనట్లుగా అనిపిస్తున్నాయి. తీసుకున్న అప్పుని ఇన్‌స్టాల్‌మెంట్లలో తీర్చినట్లుగా మబ్బులు రావల్సిన వానని ఇన్‌స్టాల్‌మెంట్లుగా వెదజల్లుతున్నాయి. దాంతో జనం గొడుగులు ముయ్యటమో, తెరవటమో అర్థంకాక నానా అవస్థ పడిపోతున్నారు. కొందరు వాన కురిసినా ఆగినా పట్టనట్లుగా కేర్‌ఫ్రీగా తడుచుకుంటూ తిరుగుతున్నారు. అలా ఉండలేనివారు వాళ్ళని చూసి ఈర్ష్యపడుతున్నా, పైకి తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు.

అందరూ ఇళ్ళు చేరి వెచ్చవెచ్చగా సేదతీరటానికి హడావిడి పడుతున్నారు. నాకు చాలా జలుబుగా, అలసటగా ఉందారోజు. కాష్ కౌంటర్‌లో పనికాగానే అక్కౌంట్స్ సెటిల్ చేసి ఇంటికి బయల్దేరాను.

ఇల్లు చేరేసరికి పిల్లలు ఫ్లాస్కులోని పాలు తాగి, టి.వి. చూస్తున్నారు. వానవల్ల ఆటలకి వెళ్ళటానికి కుదరటంలేదని బేబీ పెద్దగా వాన దేవుడి మీద ఫిర్యాదు చేసింది. ఏదో సర్దిచెప్పి నా రొటీన్ పనులు కొన్ని చేసి, పేపరు చూస్తూ నడుం వాల్చాను. ఎప్పుడు నిద్రాదేవి నా కళ్ళ

మీద తన కరుణాకటాక్షాలని వెదజల్లిందోగాని ప్రొద్దుటినుంచీ అలసిసొలసిన నా నేత్రద్వయం విశ్రాంతిగా ఆదమరిచింది.

మెలకువ వచ్చేసరికి వంట ఇంట్లో పోపులో ముక్కలు వేస్తున్నచప్పుళ్ళు వినిపిస్తున్నాయి. పిల్లలు బుద్ధిగా చదువుకుంటున్నారు. గడియారం వంక చూశాను. సమయం ఎనిమిది కావస్తోంది.

"ఏమిటింత నిద్ర పట్టేసింది? నన్ను లేప లేదేం?" అన్నాను శ్రీమతితో.

"అలసటగా ఉన్నట్లున్నారు?, నిద్రపట్టింది కదా... ఎందుకు డిస్టర్బ్ చేయటం అని ఊరుకున్నాను" చెప్పింది శ్రీమతి.

రెండు రోజులుగా వాయిదా పడుతున్న బేబీ ఫ్రాక్ జిప్ ఈ రోజు వెళ్ళి వేయిద్దామని అనుకున్న సంగతి జ్ఞాపకం వచ్చి గబగబా లేచి ప్యాంటు, షర్టు వేసుకుని, తలదువ్వుకుని, గొడుగు తీసుకుని బయల్దేరాను. వర్షం పడటం ఆగి అప్పటికే చాలా సేపయినట్లుంది. రోడ్లు కొంతవరకూ ఆరి, తడీపొడిగా ఉన్నాయి. ఆకాశం మాత్రం ఇంకా మేఘావృతమై ఉండటం వల్ల నక్షత్రాలెక్కడా కనిపించడం లేదు. వీధి దీపాలే పోటీలేని తారల్లా టెక్కుగా మిణుకు మిణుకుమంటున్నాయి.

రొంప భారం మూలాన అలసటగా ఉండి, అడుగులు నెమ్మదిగా వేస్తూ టైలర్ సుబ్రహ్మణ్యం షాపు వైపుకి వెళ్తూండగా ఎదురయ్యాడు నా కొలీగ్ సుందరం. బ్యాంక్ స్టాఫ్ మధ్యలో ఉన్న ఏవేవో గొడవలు, పాలిటిక్స్ ఎత్తుకొచ్చి బోర్ కొట్టడం మొదలుపెట్టాడు. అసలే రొంపగా ఉందేమో, నాకు చిర్రెత్తుకొచ్చింది. అయినా అది మొహం మీద ప్రతిఫలించకుండా జాగ్రత్త పడుతూ అతను చెప్తున్న విషయాలన్నిటికీ ఊ... కొడుతున్నాను. బ్యాంక్ బాయ్ దగ్గర్నుంచి మేనేజర్ వరకూ ఒక్కళ్ళని కూడా వదలకుండా అందరి విషయాలు, తను ఆరా తీసి పోగేసిన డేటా అంతా నాకు అందించాడు. పైగా నాకు తెలియని విషయాలు చెప్పి జ్ఞానోదయం కలిగిస్తున్న బుద్ధుడిలా పోజూ వీడూను... నాకు మనస్సులో టైలర్ షాపు మూసేస్తాడేమోనని కంగారుగా ఉంది. మాట్లాడుతూనే షాపువైపుకి దృష్టి సారించి చూస్తున్నాను మధ్య మధ్యలో.

దూరం నుంచి కనిపిస్తోంది మా పనిమనిషి గోవిందమ్మ. తను కూడా టైలర్ షాపులోకే వెళ్తోంది. తన మనవడికి మా బాబిగాడి ప్యాంటు సైజు చేయించటానికే అయి ఉంటుంది. షాపులో సుబ్రహ్మణ్యం ఒక్కడే ఉన్నాడు. నేను సుందరంతో మాట్లాడుతూనే అక్కడ షాపులో జరుగుతున్నవన్నీ గమనిస్తున్నాను. గోవిందమ్మ ప్యాంటు చూపించి ఏదో చెప్తోంది. సుబ్రహ్మణ్యం ఆమె బట్టలు చూసి ఆమెని చీదరించుకుంటున్నాడులా ఉంది. ఆమె షాపు బయటకు వచ్చి మళ్ళీ ఏదో చెప్తోంది. ప్రాధేయపడ్తోంది. సుబ్రహ్మణ్యం షాపులోకి వెళ్ళి ఏదో కాయితం లాంటిది చూపించి సైగలు చేస్తున్నాడు.

ఈలోగా నేను సుందరం మాటలకు బలవంతంగానే ముక్తాయింపు పాడించాను. నా నుంచి ప్రోత్సాహకరమైన రెస్పాన్స్ లేకపోవటంతో ఇక విధిలేక తన బోర్ ఆపి వదిలేశాడు. "హమ్మయ్య..." అనుకుని కదిలాను.

అప్పటికే గోవిందమ్మ ప్యాంటు తీసుకుని, రోడ్డు దాటి నేనున్నవైపుగా వస్తోంది. సుబ్రహ్మణ్యం రేపు తెస్తే చేస్తానని చెప్పి ఉంటే బాగుండును అనుకున్నాను అసలు జరిగింది అది కాదని తెలుస్తున్నా...

నిరాశగా ఉన్న ముసలిదానిని నేనే పిలిచి "ఎక్కడి నుంచి వస్తున్నావ్ గోవిందమ్మా?" అడిగాను.

"ఆ మూగాడి విషయమా బాబూ నువ్వు

సెప్తా...? ఆడని తెలిస్తే నేనసలు ఆడకెళ్ళేదానినే కాదు బాబు. మీ పేరు సెప్పినా కూడా వాడు పట్టిచ్చుకోలేదు. ఆడు శానా... ఆశ పాతకుడు. ఇదెరికి కూడా ఏదో సిన్న రిపేరు కోసం బట్టల ట్టికెళ్తే గెంటేసిండు. ఇప్పుడు కూడా మాటాడ డం రాకపోయినా వంద రూపాయలు సూపిచ్చి తెమ్మని సైగ సేస్తుండు. ఆ కత్తెరలు, అయి లేకగాని నేనే కుట్టుకుందును బాబు సేత్తో. ప్యాంటు పొట్టి సెయ్యటానికే వంద ఇవ్వగలిగితే కొత్త లాగైనా కొనిద్దునుగందా... నా మనవడికి. మండిపడుతోంది గోవిందమ్మ.

నేను ఆమెకి సర్ది చెప్పి పంపేశాను. అప్ర యత్నంగా నాకు రెండ్రోజుల క్రితం నా శ్రీమతి అన్నమాటలు గుర్తొచ్చాయి. అప్పుడు నేను ఆ మాటలకి అంత ప్రాముఖ్యతనివ్వలేదుగాని, ఇప్పుడు అనిపిస్తున్నాయి తన మాటలు అక్ష రాలా నిజమని.

“మీరు అవసరమైన దానికంటే ఎక్కువగా సుబ్రహ్మణ్యం విషయం పట్టించుకుంటున్నా రేమో... వాడు మూగవాడైనా తన విషయం తను చూసుకోలేనంత అమాయకుడేమీ కాదు. కొంత వరకూ సహాయం చేసి దారి చూపించా రు కదా... ఇంక ఎక్కువగా తాపత్రయ పడనక్క ర్లేదు”. ఇవే ఆమె నాతో అన్నమాటలు. ఈ మాటల్లో చాలా జీవన సత్యాలు నాకు ఇప్పుడు అగుపిస్తున్నాయి. అలా ఆమె అన్నప్పుడు నేను అనుకున్నాను... ఆడవాళ్ళకి భర్తలు తమకి తప్ప, ఇంకెవరికీ సహాయపడటం ఇష్టం ఉం డదు. వాళ్ళు తమ సహించలేని స్వభావాన్ని ఇలాంటివి మాట్లాడి వ్యక్తపరుస్తారని తప్పుగా ఆలోచించాను.

సుబ్రహ్మణ్యానికున్న మాట రాని లోటుని, లేమిని చూసి నేను సానుభూతి మాత్రం వ్యక్త పరిచి ఊరుకోలేకపోయాను. అతనికి నా చేత నైనంత సహాయం చేసేవరకూ ఊరుకోలేదు నా మనస్సు.

ఏ ప్రతిఫలాన్నీ ఆశించకుండా అతనిని పైకి తీసుకురావాలని కంకణం కట్టుకుని మరీ సహాయపడ్డానని అనుకుని నన్ను నేను మోసం చేసుకున్నాను. కానీ అతను మళ్ళీ లేమి, లోట్లు, లోపాలు ఉన్న తనసాటి వారికి అవసరమైన ప్పుడు తన చేయూత, సహాయం అందించాలన్న ప్రతిఫలాన్ని నా మనస్సు ఆశించిందన్న మాట. అందుకనే అతను గోవిందమ్మ యందు చూపిన ఈ నిరసన భావం నన్ను ఇంతగా కలవరపె ట్టింది. సుబ్రహ్మణ్యం లాంటివారు చూపులతో చాలామంది చూపే సానుభూతికి మాత్రమే అర్హు లేమోననిపించింది నాకు ఆ క్షణంలో.

సుబ్రహ్మణ్యానికి నా ఆసరాతో ఇక పని లేదు. ఈ సమాజంలో అతను గడుసుగా బ్రతి కెయ్యగలడు. ఆ నేర్పు వచ్చేసిందతనికి.

మనకి శక్తున్నంతలో అశక్తులకి సహాయం, సహకారం చూపాలేకానీ మళ్ళీ వాళ్ళు అదేపనిని వాళ్ళ తోటివాళ్ళకి చేయాలనే ప్రతిఫలాన్ని ఆశిస్తే నిరాశ ఎదురవ్వవచ్చనే కొత్త పాఠం నేర్చుకున్నాను నేనారోజు.

నేను ఆశించిన ప్రతిఫలాన్ని పొందినా పొందకపోయినా ఆశావాదినైన నేను అంగ వికలురకి, అశక్తులకీ నా ఆదరణ చూపటంలో నా వంతు పాత్ర నేను వహించి తీరాలన్నా తీర్మానంతో ఇంటివైపుకి మళ్ళాను. ●

### 'నాన్న' వయసు

మీ నాన్న వయసెంత?
నా వయసంతే...
అదెలా?
మరి... నేను పుట్టిన తరువాతే కదా ఆయన 'నాన్న' అయ్యాడు?